సాక్షి
అనంతపురం
శుక్రవారం । 13 । జనవరి । 2023



టన్ను చీనీ రూ.25 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.25 వేలు పలికాయి.



కిలో టమాట రూ.12

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ఠంగా రూ.12, కనిష్ఠం రూ.3 చొప్పున పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
31.9°/09.1°

జిల్లా అంతటా గురువారం చలి తీవ్రత కొనసాగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదుకాగా, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి.

న్యూస్‌రీల్

బాలికలకు పౌష్టికాహారం అవసరం



రక్తహీనత పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి దొర

బుక్కరాయసముద్రం: కిశోర బాలికలకు పౌష్టిక ఆహారం ఎంతో అవసరం అని డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి దొర పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని ఓపీ కేసులు వస్తున్నాయి? ఎలాంటి కేసులు వస్తున్నాయని వైద్య సిబ్బందితో ఆరా తీశారు. కిశోర బాలికలు క్రమ తప్పకుండా పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్తహీనత పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, డాక్టర్ నారాయణ, పీహెచ్‌సీ డాక్టర్ స్వాతి లక్ష్మి, సీహెచ్‌ఓ మోహన్, సూపర్ వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్‌ఎం ఆది నారాయణమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ఎస్పీ సంక్రాంతి శుభాకాంక్షలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా ప్రజలందరికీ ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎస్పీ ఓ ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి.. ప్రతి ఇంటా సరికొత్త సంతోషాలను తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లకుండా అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ



శిక్షణ పొందిన అధ్యాపకులకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న ఎస్కేయూ వీసీ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో గత నాలుగు రోజుల పాటు ‘ 21వ శతాబ్దపు నైపుణ్యాలు– బోధన పద్ధతులు’ అనే అంశంపై అధ్యాపకులకు ఇస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా విద్యార్థులకు ఎలా బోధించాలి ? అనే అంశంపై ఇచ్చిన శిక్షణ ఉపయుక్తంగా ఉందన్నారు. ఈ సందర్భంగా శిక్షణార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విశిష్ట అతిథిగా దినకర్‌రెడ్డి హాజరై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాప్ లీగ్ విజేత ‘స్టేడియం జట్టు’



విజేతగా నిలిచిన స్టేడియం జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా స్థాయి శాప్ లీగ్ వాలీబాల్ విజేతగా స్టేడియం జట్టు నిలిచింది. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు స్థానిక నీలం సంజీవరెడ్డి క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల జట్లు పాల్గొన్నాయి. క్రీడా పోటీలను ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు, జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాప్ క్రీడాకారులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శాప్ లీగ్స్ ద్వారా పోటీలు నిర్వహించి ఉత్తమ క్రీడాకారులను సిద్ధం చేస్తోందన్నారు. ప్రస్తుతం రెండవ సెషన్ లీగ్స్ పోటీలు కొనసాగుతున్నాయన్నారు. ఈ టోర్నీలో ప్రథమ స్థానంలో స్టేడియం జట్టు, ద్వితీయ స్థానంలో నార్పల జట్టు, తృతీయ స్థానంలో రాజేంద్ర మునిసిపల్ హైస్కూల్ జట్టు నిలిచాయి.



రాయదుర్గానికి చెందిన 42 ఏళ్ల యువకుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 21వ తేదీన అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు పరిశీలించారు. అతను పనిచేసే ఆఫీసులో తీవ్ర ఒత్తిడి ఉంది. బాస్ నిత్యం వేధిస్తున్నారన్న భావన నెలకొంది. దీంతో రోజు రోజుకూ మానసికంగా కుంగిపోయి సొంతవూరికి వచ్చేశారని వైద్యులు తేల్చారు.

ఉరవకొండకు చెందిన 36 ఏళ్ల మహిళ కొంతకాలంగా ఎవరితోనూ మాట్లాడటం లేదు. ఏదో ఆలోచిస్తూనే ఉంటుంది. ఏమి చెప్పినా ఆలకించే స్థితి దాటిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకెళ్లారు. గత ఏడాది ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో కూతురుకు తక్కువ మార్కులు రావడంతో ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లినట్లు డాక్టర్ తెలిపారు.

అటెన్షన్

- పెరుగుతున్న మానసిక ఒత్తిడి కేసులు
- నగటున నెలకు 1500 మంది అనంత సర్వజనాస్పత్రికి..
- వ్యసనాలు, కుటుంబ, ఆర్థిక సమస్యలతో కుంగిపోతున్న వైనం
- జీవనశైలిని మార్చుకోవాలని వైద్యుల సూచన

మారుతున్న కాలానికి అనుగుణంగా మానసిక జబ్బులకు గురవుతున్న వారి సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. చాలా మంది ప్రతి చిన్న విషయానికీ తీవ్రంగా కలత చెందుతున్నట్లు వైద్యుల పరిశీలనలతో వెల్లడింది. ఎప్పుడూ ముభావంగా ఉండటం, నలుగురితో కలవకపోవడం, పలకరించినా స్పందించకపోతుండటంతో సదరు వ్యక్తులను తీసుకొని బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రుల బాట పడుతున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురంలోని సర్వజనాసుపత్రికి మానసిక రుగ్మతలతో వస్తున్న వారిని పరిశీలించగా.. మానసిక ఒత్తిళ్లు, మానసిక రుగ్మతలు ఎదుర్కొంటున్న వారిలో మహిళల కంటే పురుషులే అధికంగా ఉన్నారు. సగటున 45 ఏళ్ల వయసు వారు ఎక్కువగా మానసిక రుగ్మతలకు గురవుతున్నట్లు తేలింది. చాలా మంది మహిళలు లేదా పురుషులు ఈ రుగ్మతలు ఉన్నట్లు కూడా తెలుసుకోలేక నిర్లక్ష్యం చేస్తుండటంతో తీవ్రత పెరిగాక వస్తున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు.

ఆర్థిక, ఉద్యోగ సమస్యలతో..

మగవాళ్లు ఎందుకు ఎక్కువ మానసిక రుగ్మతల బారిన పడుతున్నారన్న విషయాన్ని వైద్యులు గుర్తించారు. ఆర్థిక, ఉద్యోగ సమస్యల్లో ఎక్కువ జోక్యం చేసుకోవడం, చెడు అలవాట్లకు బానిస కావడం ప్రధాన కారణాలని చెబుతున్నారు. అలాగే సరైన వ్యాయామం లేకపోవడంతో చిన్న చిన్న శారీరక సమస్యలకు కూడా మానసికంగా కుంగిపోతున్నారని తేల్చారు. జలుబు, దగ్గు లాంటివి ఎక్కువ రోజులు వేధించినా వారు తట్టుకోలేకపోతున్నారని అంటున్నారు.

చిన్న విషయానికే నిరాశ..

వాస్తవానికి చెడు అలవాట్లు ఆడవాళ్లలో చాలా తక్కువ. అయినా సరే నిరాశకు గురై మానసిక ఆందోళన చెందుతున్న ఆడవాళ్ల సంఖ్య కూడా ఎక్కువేనని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రతి చిన్న విషయానికి డిప్రెషన్ (నిరాశ)కు గురవుతున్నారు. మహిళలు చిన్న చిన్న కుటుంబ విషయాలకు కూడా తీవ్రంగా స్పందించడం, ఆలోచించడం వల్ల మానసికంగా ఒత్తిడి ఎదుర్కొంటున్నారని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి కుటుంబాల్లో ఇమడలేక.. ఒంటరితనాన్ని భరించలేక మానసిక ఆందోళన చెందుతున్నారనేది వైద్యుల అభిప్రాయం.

పట్టించుకోకపోతే ముప్పే..



మానసిక రుగ్మతలను పట్టించుకోకపోయినా ముప్పేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒత్తిడి వల్ల కోపం, బాధ లాంటివి పెరిగిపోవడంతో అసిడిటీ, అల్సర్ లాంటి సాధారణ సమస్యల నుంచి గుండె, బీపీ, మధుమేహం, కిడ్నీ సమస్యల దాకా అనేక రకాల జబ్బులను మోసుకొస్తాయని స్పష్టం చేస్తున్నారు.

2022లో అనంత సర్వజనాస్పత్రిలో నమోదైన గణాంకాలు ఇలా..

నెల	పురుషులు	మహిళలు
జూలై	799	611
ఆగష్టు	671	547
సెప్టెంబర్	778	663
అక్టోబర్	712	671
నవంబర్	802	722
డిసెంబర్	635	495

మానసిక ఒత్తిడికి చెక్‌పెట్టండిలా...



- కనీసం మనిషి రోజుకు 7 నుంచి 8 గంటల పాటు నిద్ర పోవాలి.
- కచ్చితంగా రోజూ వ్యాయామం చేయాలి. 45 నిముషాల పాటు వాకింగ్, రన్నింగ్ చేసినా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు.
- యోగా, ధ్యానం చేస్తూ ఒత్తిడిని జయించవచ్చు.
- తీసుకునే ఆహారం కూడా ఒత్తిడిని తగ్గిస్తాయని వైద్యులు చెబుతున్నారు. తాజా కూరగాయలు, పండ్లు, చేపలు, చిరు ధాన్యాల్లో ఎక్కువగా కార్బోహైడ్రేట్స్, పొటీన్స్, విటమిన్స్‌తో పాటు మినరల్స్ ఉంటాయి. ఈ ఆహారం తీసుకోవడం వల్ల ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

బాధితులు ఎక్కువవుతున్నారు



ఫలానా మానసిక రుగ్మత అందరికీ ఉండాలని లేదు. మగవాళ్లలో స్కిజోఫినియా ఎక్కువగా ఉంటుంది. అదే ఆడవాళ్ల విషయంలో డిప్రెషన్ ఎక్కువ. సోషియల్ ఎలిమెంట్స్ అంటే సామాజిక కారణాలు.. కుటుంబ, ఆర్థిక సమస్యలు వంటివి ఒక కారణం. చిన్న చిన్న సమస్యలకు కూడా కొందరు కుంగిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీరికి కౌన్సిలింగ్ కావాలి.

– డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, జాతీయ హెల్త్‌మిషన్

కుటుంబ వ్యవస్థ దెబ్బతింటోంది



కుటుంబ వ్యవస్థ బాగా దెబ్బతింటోంది ప్రధానంగా చిన్న చిన్న విషయాలకు కూడా బాగా రియాక్ట్ అవుతున్నారు. పిల్లలకు చదువులో మంచి మార్కులు రాకపోయిన, తమ గోల్ సాధించకపోయిన ఇలా ప్రతి అంశానికి సంబంధించి ఒత్తిడి ఉంటోంది. అన్ని వయస్సుల వారు ఒత్తిడి బారిన పడుతున్నారు.అలాగే వ్యసనాలకు అలవాటు పడటం, కుటుంబంలో ఒకరిపై ఒకరు ఆధిపత్యం వంటి ఎన్నో ఒత్తిడికి కారణమవుతున్నాయి. సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యాన్ని అందిస్తున్నాం.

– డాక్టర్ అనిల్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్

ఎస్‌ఏలుగా 191 మంది ఎస్జీటీలు

- నెలకు రూ.2500 అలవెన్స్
- నేడు జిల్లా సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్
- ఆర్జేడీ డీఈఓ వెంకట కృష్ణారెడ్డి



అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి నుంచి విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో బోధన చేయించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం జిల్లాలో మొత్తం 191 మందికి అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకు వీరికి నెలకు రూ.2,500 చొప్పున అలవెన్స్ ఇస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇంగ్లిష్ 127, మేథమేటిక్స్ 47, సోషల్ స్టడీస్ 12, సోషియల్ (ఉర్దూ) 01, మేథమేటిక్స్ (ఉర్దూ) 02, ఫిజిక్స్ ఉర్దూ (01) మొత్తం 191 మందికి సబ్జెక్టు టీచర్లుగా అవకాశం కల్పిస్తారు.

నేడు కౌన్సెలింగ్..

అక్టోబర్ 2022లో పదోన్నతికి ఆసక్తి తెలిపిన ఎస్జీటీలు శుక్రవారం సైన్స్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆర్జేడీ ఎం. వెంకట కృష్ణా రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకే హాజరుకావాలని కోరారు. ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్‌గా పనిచేయడానికి స్థానాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఎవరైనా గైర్హాజరు అయితే క్రమశిక్షణా చర్యల కింద నాలుగో కేటగిరి ప్రాంతానికి బదిలీ చేస్తారు.

- స్కూల్ అసిస్టెంట్‌ల్లో మిగులు పోస్టుల్లో ఉన్న వారు, సబ్జెక్టు కన్వర్షన్ టీచర్లు, అక్టోబర్ 2022లో పదోన్నతికి ఆసక్తి తెలిపినవారికి పని సర్దుబాటు చేయనున్నారు.
- సబ్జెక్టు కన్వర్షన్‌కు ఆప్షన్ ఇచ్చిన వారిని అదే పాఠశాలకు అవసరం అనుకుంటే కొనసాగించవచ్చు. లేదా గతంలో పనిచేస్తున్న సబ్జెక్టుకు అవసరమయినా అదే పాఠశాలలో కొనసాగించవచ్చు.
- ప్రీ హైస్కూల్ (3 నుంచి 8వ తరగతి) లో 98 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉంటే అక్కడ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లను ఉన్నత పాఠశాలకు తప్పనిసరిగా సర్దుబాటు చేస్తారు.
- సర్‌ప్లస్ సబ్జెక్టు టీచర్లు, సబ్జెక్టు కన్వర్షన్ టీచర్లను సర్దుబాటు చేసిన అనంతరం ఇంకా అవసరం అయితే పదోన్నతికి సమ్మతించిన వారితో సర్దుబాటు చేస్తారు.

రూ.2.16 లక్షలకు వరిగడ్డి వేలం

కణేకల్లు: స్థానిక అగ్రికల్చర్ ఫారంలో 140 ఎకరాల పండిన వరి గడ్డిని వేలం వేయగా రూ.2.16లక్షల ఆదాయం సమకూరింది. డీడీఏ మద్దిలేటి, ఏడీఏ రవి తెలిపారు. గురువారం అగ్రికల్చర్ ఫారం కార్యాలయంలో వరిగడ్డి వేలం పాటలు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు వేలం పాటలో పాల్గొన్నారు. అనంతపురంలోని ఇస్కాన్ గోశాల నిర్వాహకులు రూ.2.16లక్షలతో వరిగడ్డిని దక్కించుకున్నారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా

- సమస్యలుంటే 1912కు డయల్ చేయండి
- ఏపీఎస్పీడీసీఎల్ స్టేట్ టెక్నికల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు



మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ స్టేట్ టెక్నికల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా చేయడమే తమ లక్ష్యమని ఏపీఎస్పీడీసీఎల్ స్టేట్ టెక్నికల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు అన్నారు. నెలవారీ డివిజన్ పర్యటనలో భాగంగా గురువారం కళ్యాణదుర్గం విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల ఎస్ఈ సురేంద్ర, కన్‌స్ట్రక్షన్ ఈఈ మోహనమ్మ, కళ్యాణదుర్గం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి శేఖర్‌తో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ల మరమత్తు కేంద్రం, సబ్‌స్టేషన్‌లను పరిశీలించారు. అనంతరం డివిజన్ పరిధిలోని ఏడీ, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా ఐదు జిల్లాల్లో పర్యటిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయం, జగనన్న లే అవుట్లు, గడప గడపకూ మన ప్రభుత్వంలో వచ్చిన ఫిర్యాదులపై దృష్టిసారించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 24/7 గంటల విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించామన్నారు. వేసవి సందర్భంగా ఏప్రిల్, మే నెలల్లో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సిబ్బంది పోల్ టు పోల్ లైన్‌లో పెట్రోలింగ్ నిర్వహించేలా ఆదేశాలిచ్చామన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి సహకరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇప్పటికే ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి వసూళ్లు చేస్తున్నారన్నారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదేవిధంగా జిల్లాలో 33 కేవీ సామర్థ్యంతో 25 సబ్ స్టేషన్లను కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కొత్తగా గరుడాపురం, బోరంపల్లి, ములకలేడు, రాయదుర్గం నియోజకవర్గంలో టి.వీరాపురం, శాంతినగర్‌లలో విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

వణుకుతున్న ఉమ్మడి ‘అనంత’



మడకశిరరూరల్: ఆర్.అనంతపురంలో రోడ్డును కమ్మేసిన పొగమంచు

- అగళిలో 8.1, గుమ్మఘట్ట 9.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాను చలి వణికిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాయంత్రం నుంచి ఉదయం 10 గంటల వరకు శీతల వాతావరణమే కొనసాగుతోంది. ప్రధానంగా శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో చలి ప్రభావం అధికం ఉంది. గురువారం అగళిలో 8.1 డిగ్రీల కనిష్టం నమోదు కాగా మడకశిర 8.4 డిగ్రీలు, బెళుగుప్ప, గుమ్మఘట్ట 9.1 డిగ్రీలు, శెట్టూరు 9.3 డిగ్రీలు, రొద్దం 9.4 డిగ్రీలు, తనకల్లు 9.5 డిగ్రీలు, సోమందేపల్లి, నల్లచెరువు, కుందుర్పి 9.6 డిగ్రీలు, కొత్తచెరువు 10.1 డిగ్రీలు, ఓడీ చెరువు 10.4 డిగ్రీలు, విడపనకల్ 10.5 డిగ్రీలు, పరిగి 10.7 డిగ్రీలు, ఉరవకొండ, అమడగూరు 10.8 డిగ్రీలు నమోదయ్యాయి. చాలా మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గిపోయాయి. పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 27 నుంచి 32 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు మిగతా మండలాల్లో 11 నుంచి 15 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

పండగొచ్చింది పద బసవా !



మకర సంక్రాంతి వేళ పల్లెలతో పాటు పట్టణాలు కూడా సరికొత్త శోభను సంతరించుకున్నాయి. ముచ్చటగా మూన్నాళ్లు చేసే పండుగకు బసవయ్యలతో గంగిరెద్దోళ్లు కూడా సిద్ధమయ్యారు. పీ..పీ ఊదుతూ గంగిరెద్దును పట్టుకొని ఇంటింటికీ వెళ్లి ఇచ్చింది తీసుకెళ్తుంటారు. హైటెక్ యుగంలోనూ బసవయ్యలను దైవంగా భావిస్తూ తమ కులవృత్తిని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు .

- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



కానిస్టేబుల్ భార్య ప్రియదర్శినికి చెక్కు అందిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం సిటీ: కళ్యాణదుర్గం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ కరోనాతో మరణించిన కానిస్టేబుల్ రమేశ్ (పీసీ–2548) కుటుంబానికి ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆర్థిక సాయాన్ని అందజేశారు. 2021 ఆగస్టు 15న రమేశ్ కరోనా కాటుకు బలయ్యారు. మృతుడి భార్య ప్రియదర్శినికి రూ.3 లక్షల సాయాన్ని చెక్కు రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం అందజేశారు. ఈ మొత్తాన్ని అందించిన మ్యాన్ కైండ్ ఫార్మా సంస్థ ప్రతినిధులకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పన పేరుతో దగా



మహిళ ఫిర్యాదును నమోదు చేసుకుంటున్న కార్యాలయ సిబ్బంది

గుంతకల్లు రూరల్: ఆర్డీఓ కార్యాలయంలో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ మహిళను మోసగించిన వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు... గుంతకల్లులోని సంజీవనగర్‌కు చెందిన తిప్పేస్వామి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. తాను నివాసముంటున్న ప్రాంతానికి చెందిన లోకేశ్వరితో ఉన్న పరిచయం చేసుకుని ఆర్డీఓ కార్యాలయంలో అటెండర్ పోస్టు ఖాళీగా ఉందని, డబ్బు ఖర్చు పెట్టుకుంటే ఆ పోస్టు ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో రెండు రోజుల క్రితం అతనికి రూ. 2 లక్షలు ఇచ్చింది. ఉద్యోగం ఇప్పించకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె తన డబ్బు తిరిగివ్వాలని పట్టుబట్టింది. డబ్బు ఇచ్చేందుకు తిప్పేస్వామి నిరాకరించడంతో గురువారం తహసీల్దార్ రామును కలసి ఫిర్యాదు చేసింది.

కామాంధుడికి నాలుగేళ్ల జైలు శిక్ష

అనంతపురం సిటీ: పదకొండేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన ఘటనలో నిందితుడికి జైలు శిక్ష పడింది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. అనంతపురానికి చెందిన బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఉదంతానికి సంబంధించి 2022, ఏప్రిల్ 29న 'దిశ' పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. 'దిశ' డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు సమగ్ర దర్యాప్తు చేసి, నిందితుడు బాబురావును అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచారు. కేసు వాదనలు ముగిసిన అనంతరం నిందితుడు నేరం చేసినట్లు రుజువైంది. దీంతో ముద్దాయి బాబాబురావుకు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కేసుల స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి గురువారం తీర్పు వెలువరించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ ఏపీపీ విద్యాపతి వాదించారు.

బాల్యానికి రక్ష.. భవితకు బాట

- దేశంలోనే తొలిసారిగా బడి బయట పిల్లల చదువుకు ప్రత్యేక కార్యక్రమం
- బోధనకు సహకరించిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక అలవెన్స్
- ఒక్కో విద్యార్థికి నెలకు రూ.250 చొప్పన మూడు నెలల పాటు అందజేత
- పది మంది ఒకే ఊరిలో ఉంటే ప్రత్యేకంగా ఓ ఉపాధ్యాయుడి నియామకం


మూడు నెలల శిక్షణ

అనంతపురం: విప్లవాత్మక సంస్కరణలతో ఇప్పటికే విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసిన జగన్ సర్కార్ మరో అడుగు ముందుకేసి బడిబయట పిల్లల విద్యాభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఏ ఒక్క బాలుడు, బాలిక అర్ధంతరంగా చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

బడి ఈడు పిల్లల కోసం ప్రత్యేక డ్రైవ్

బడి బయట ఉన్న పిల్లలకు ప్రత్యేక శిక్షణను ఇవ్వడం ద్వారా సాధారణ విద్యార్థులతో పాటే వీరిలోనూ అభ్యసన సామర్థ్యాలను పెంచేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కార్యాచరణ రచించింది. తల్లిదండ్రులు వలస వెళితే ఇంటి వద్ద నాన్నమ్మ, అమ్మమ్మకు చేదోడుగా పిల్లలు ఉంటున్నారు. ఈ క్రమంలో వారు పాఠశాలకు డుమ్మా కొట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి బాల, బాలికలను గుర్తించి, తిరిగి వారిని బడికి పంపేలా పెద్దలకు నచ్చచెప్పేందుకు ప్రత్యేక కార్యాచరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో 370 మంది, అనంతపురం జిల్లాలో 623 మంది పిల్లలు బడి బయట ఉన్నట్లు ఇప్పటికే సమగ్రశిక్ష అధికారులు గుర్తించారు. ఇందులో 126 మందిని తిరిగి పాఠశాలలో చేర్పించారు.

తల్లిదండ్రులు వలస వెళ్లి.. ఇంటి వద్దనే ఉంటూ చదువుకు దూరమైన బడి బయట పిల్లల చదువుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. దేశంలోనే తొలిసారిగా ఏపీలో ఈ విధానం చేయడం గమనార్హం. ఒకే ఊరు లేదా ఆవాస ప్రాంతంలో కనీసం 20 మంది బడి బయట పిల్లలుంటే వారికి ప్రత్యేకంగా ఓ ఉపాధ్యాయుడు (ఎస్‌ఆర్‌ఎస్‌టీసీ), (ఆర్‌ఎస్‌టీసీఎస్/ ఉపాధ్యాయ వలంటీర్)ని నియమిస్తారు. వీరికి మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఒకే ప్రాంతంలో 20 మంది బడి బయట పిల్లలు అందుబాటులోకి రావడం కష్టమైతే కనీసం 10 మంది ఉన్నా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం తాజాగా జీఓ జారీ చేసింది. ఇలా కాకుండా ఒక ఊరిలో ఒకరిద్దరున్నా.. వారిని సమీప ప్రాంతంలోని పాఠశాలలో చేర్పించి, విద్యాప్రమాణాల పెంపునకు సహకరించే ఉపాధ్యాయుడికి నెలకు రూ.250 చొప్పున మూడు నెలలకు రూ.750 అలవెన్స్‌ను ప్రభుత్వం చెల్లించనుంది. మూడు నెలల పాటు అదే పాఠశాలలో పాఠాలు చెబుతారు. అనంతరం రాబోయే నూతన విద్యా సంవత్సరంలో అదే పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థిగా కొనసాగిస్తారు. ఈ క్రమంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించే పనిలో సచివాలయ వలంటీర్లు నిమగ్నమయ్యారు.

బడి బయట ఏ ఒక్కరూ ఉండడానికి వీల్లేదు



'బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి - బడి బయట ఒక్క విద్యార్థీ ఉండకూడదు' అని రాష్ట్ర ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంగా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అందరినీ అప్రమత్తం చేశాం. బడి బయట ఉంటున్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించి వారిలో బోధనాభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకున్నాం.

– ఎం.వెంకటకృష్ణారెడ్డి, ఆర్జేడీ, విద్యాశాఖ

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడం అభినందనీయం

- సీనియర్ సివిల్ జడ్జి గరికపాటి దీనబాబు


కృత్రిమ అవయవాలను అందిస్తున్న జడ్జి దీనబాబు, నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గురువారం భారత్ వికాస్ పరిషత్తు (బీవీపీ) ఆధ్వర్యంలో 64 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ అందించారు. స్థానిక గీతామందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి గరికపాటి దీనబాబు, విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి, జాతీయ న్యాయవాద మండలి సభ్యుడు ఆలూరు రామిరెడ్డి, భారత వికాస పరిషత్తు రాష్ట్ర కోశాధికారి సుంకు వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి 19 ఏళ్లుగా భారత వికాస్ పరిషత్తు చేస్తున్న కృషిని అభినందించారు. అంతకు ముందు బీవీపీ కార్యకర్తలు స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీవీపీ కన్వీనర్ రమణా నాయుడు సీనియర్ న్యాయవాదులు హరికృష్ణ, నాగేశ్వరి, టీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, మూలా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున మృతదేహం లభ్యం

కణేకల్లు: మూడు రోజుల క్రితం హెచ్చెల్సీ దూకిన మల్లికార్జున (39) గురువారం ఉదయం మృతదేహమై లభ్యమయ్యాడు. వివరాలు.. అనారోగ్యంతో బాధపడుతున్న మల్లికార్జున తాను హెచ్చెల్సీ దూకి చనిపోతున్నానంటూ ఈ నెల 10న సెల్ఫీ వీడియో తీసి భార్యకు పంపిన విషయం తెలిసిందే. మూడు రోజులుగా హెచ్చెల్సీ వెంబడి కుటుంబసభ్యులు, పోలీసులు గాలింపు కొనసాగిస్తూ వచ్చారు. గురువారం ఉదయం తుంబిగనూరు వద్ద మల్లికార్జున మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు.

302 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


సీజ్ చేసిన లారీ, బొలెరో వాహనాలను చూపుతున్న విజిలెన్స్ అధికారులు

గుత్తి రూరల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 302 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని రెండు వాహనాలను సీజ్ చేశారు. వివరాలు.. అందిన ముందస్తు సమాచారంతో గురువారం ఉదయం 6.30 గంటలకు గుత్తి మండలం బసినేపల్లి శివారులో విజిలెన్స్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ లారీతో పాటు బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి, వాహనాలను సీజ్ చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న వాహనాల డ్రైవర్లు శ్రీనివాసులు, నరసింహులు, వ్యాపారులు నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన వడ్డే నాగరాజు, రామచంద్రపై 6ఏ యాక్ట్ మేరకు కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ, డీసీటీఓ విజయలక్ష్మి, సీఎస్‌డీటీ కంబక్క తెలిపారు.

పెన్నహోబిలంలో విషాదం

- దైవ దర్శనానికి వచ్చి జలపాతంలో గల్లంతైన బాలిక
- వెలికి తీసే లోపు మృతి


ప్రమాదానికి కొద్ది సేపు ముందు చెల్లెలుతో కలసి ఫొటో దిగిన మహిత (ఆరంజ్ కలర్ డ్రస్)

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో ఉన్న జలపాతంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి ఓ బాలిక మృతి చెందింది.

వివరాలు.... బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లికి చెందిన గోపాలకృష్ణారెడ్డి, హిమబిందు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మహిత (14) అనంతపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సంక్రాంతిని పురస్కరించుకుని పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో గురువారం ఉదయం పిల్లలను పిలుచుకుని తల్లి పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చింది. ఆలయంలో పూజలు ముగించుకుని దిగువన ఉన్న జలపాతం వద్దకు చేరుకున్నారు. సెల్‌ఫోన్‌తో సరదాగా ఫొటోలు దిగారు. ఈ క్రమంలో జలపాతానికి ఎగువన పిల్లలు వరుసగా నిలబడి ఉండగా తల్లి ఫొటో తీసింది. అదే సమయంలో నీళ్లలో ఉన్న పాచి పట్టిన రాతిపై కాలు పెట్టిన మహిత ఒక్కసారిగా జారిపడి జలపాతం దిగువకు కొట్టుకుపోయింది. గమనించిన తల్లి ఒక్కసారిగా కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో కొందరు యువకులు జలపాతంలోకి దూకి మహిత కోసం గాలింపు చేపట్టారు. అప్పటికే నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన మహితను జలపాతానికి ఫర్లాంగు దూరంలో యువకులు గుర్తించి వెలికి తీశారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని మహితను ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఉరవకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ముస్లింల అభ్యున్నతికి తోడ్పాటు

- బాధ్యతల స్వీకారోత్సవంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్


మాట్లాడుతున్న కాగజ్‌ఘర్ రిజ్వాన్ (చిత్రంలో) బాధ్యతలు స్వీకరించిన నూతన సభ్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణతో పాటు ముస్లింల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తామని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ పేర్కొన్నారు. అనంతపురంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్మన్‌గా అహమ్మద్ బాషా, కార్యదర్శిగా నూర్ మహమ్మద్, సహ కార్యదర్శిగా ఖాజా, సభ్యులుగా ఖమర్ తాజ్, షెక్షావలి, ఆసీఫ్, మహబూబ్ పీరా, మీరాబాషా, ఫయాజ్ కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వక్ఫ్‌బోర్డుకు చెందిన 10,330 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందన్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో 4,500 ఎకరాలున్నాయని వివరించారు. వీటిని తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. వక్ఫ్‌బోర్డు ద్వారా వచ్చే ఆదాయన్ని ముస్లిం అభ్యున్నతికి వినియోగిస్తామన్నారు. మసీదులు, దర్గాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు ఆమోదం తెలిపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకరించిన మంత్రి అంజాద్‌బాషా, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీచరణ్, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ కుటుంబంతోనే ముస్లింలకు సముచిత స్థానం దక్కుతోందన్నారు. టీడీపీ హయాంలో మౌజన్, ఇమాంలకు బకాయి పడ్డ రూ.15.40 కోట్లను జగన్ ప్రభుత్వం చెల్లించడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ రఫి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ మస్తాన్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వక్ఫ్‌బోర్డు సభ్యులు మర్యాద పూర్వకంగా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలసి మాట్లాడారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు సహకారించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెళుగుప్ప: మండలంలోఇన శీర్పి గ్రామ శివారున ముళ్లపొదల్లో గురువారం పేకాట ఆడుతున్న 16 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణయ్య తెలిపారు. నిందితుల నుంచి రూ.2,12,400, 16 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డ వ్యక్తి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇన్సులేటర్‌కు చిక్కుకుని వేలాడుతున్న నాగభూషణ

కళ్యాణదుర్గం: పిట్టగోడపై నడుస్తూ అదుపు తప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... కళ్యాణదుర్గంలోని రాచప్పబావి వీధికి చెందిన నేసే నాగభూషణ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. గురువారం ఉదయం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రహరీ పిట్టగోడపై నడుచుకుంటూ వెళుతుండగా అదుపు తప్పి పాఠశాల ఆవరణలో ఉన్న 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై ట్రాన్స్‌ఫార్మర్ ఇన్సులేటర్‌కు ప్యాంట్ చిక్కుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కావడంతో విద్యుత్ ప్రసరణ ఆగిపోయింది. 60 శాతం కాలిన గాయాలతో నాగభూషణ ఇన్సులేటర్‌కు చిక్కుకుని వేలాడసాగాడు. విషయాన్ని గమనించిన స్థానికులు కర్రల సాయంతో అతన్ని కాపాడి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

22 నుంచి అశ్వత్థం తిరునాల


అశ్వత్థం కట్టపై వెలసిన శింగరబట్టు, గణపతి, నారాయణస్వామి విగ్రహాలు


చక్రభీమలింగేశ్వర స్వామి మూలవిరాట్

- మూడు రాష్ట్రాల నుంచి తరలి రానున్న భక్తులు

పెద్దపప్పూరు: పురాతన ఆలయాల్లో ఒక్కటిగా... దక్షిణ కాశీగా ప్రఖ్యాతిగాంచిన అశ్వత్థం క్షేత్ర తిరునాల ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుంది. ఐదు ఆదివారాల పాటు సాగే ఈ తిరునాలకు ఏపీ నుంచేగాక కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలిరానున్నారు. ఉత్తర వాహినిగా ఉన్న పెన్నానదిలో స్నానం చేసి, స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలిగి పోతాయని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో ఏటా మాఘమాసంలో జరిగే అశ్వత్థం తిరునాలకు భక్తులు పోటెత్తుతారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయం వద్ద పాలకమండలి చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు చేశారు. నదిలో స్నానం కోసం వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. 22, 29, ఫిబ్రవరి 5, 12, 19 తేదీల్లో జరిగే తిరునాలలో ఫిబ్రవరి 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని భీమలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. తిరునాలను పురస్కరించుకుని ఆయా తేదీల్లో తాడిపత్రి, ముచ్చుకోట, కొండాపురం, నార్పల, ధర్మవరం, బనగానపల్లి, గుత్తి, యాడికి, అనంతపురం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ఆర్టీసీ నడపనుంది.

స్టాంప్ వెండర్లపై చర్యలకు సిఫారసు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రిజిస్టర్ కార్యాలయం వద్ద అధిక ధరకు స్టాంప్‌లను విక్రయిస్తున్న 15 మంది ఆధీకృత విక్రయదారులపై చర్యలకు విజిలెన్స్ అధికారులు సిఫారసు చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ వీరరాఘవరెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఉదయం నగరంలోని రిజిస్టర్ కార్యాలయాల వద్ద విజిలెన్స్ సీఐ రామారావు, ఎస్‌ఐ బాలకృష్ణ, ఏఈఈలు రాజశేఖర్, కుళ్లాయిరెడ్డి, ఏజీ శివప్రసాద్ తనిఖీలు చేపట్టారు. 15 మంది స్టాంప్ వెండర్లు నిర్ణీత ధరతో కాకుండా రెట్టింపు ధరతో విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. వీరిలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఉన్నాట్లుగా నిర్ధారించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న 15 మంది స్టాంప్ వెండర్లపై చర్యలు తీసుకోవాలంటూ తగిన ఆధారాలతో జిల్లా రిజిస్ట్రార్‌కు విజిలెన్స్ అధికారులు సిఫారసు చేశారు.

గుత్తి సమీపంలో ప్రమాదం.. రాప్తాడు వద్ద వాహనం పట్టివేత

రాప్తాడు/గుత్తి రూరల్: గుత్తి సమీపంలో వాహనాన్ని ఢీకొని తప్పించుకుని వచ్చిన కంటైనర్‌ను రాప్తాడు పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. వివరాలు.. గుత్తి మండలం బాట్లో సుంకలమ్మ ఆలయం దగ్గర జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కంటైనర్ గురువారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన రాముడు, అంజినమ్మ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా అతి వేగంతో దూసుకెళ్లాడు. విషయాన్ని అక్కడే ఉన్న వ్యక్తి డయల్ 100కు సమాచారం అందజేయడంతో హైఅలర్ట్ యాప్ ద్వారా వెంటనే బెంగళూరు మార్గంలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు అప్రమత్తమయ్యారు. రాప్తాడు మండలం మరూరు టోల్‌ప్లాజా వద్ద కంటైనర్‌ను ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది గుర్తించి వాహనాన్ని, ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, ప్రమాదంలో గాయపడిన ఇద్దరూ అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వ్యాపారం పేరుతో టోపీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: భాగస్వామ్య వ్యాపారం పేరుతో వంచన చేసిన వ్యక్తిపై అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన నాయుడు, ఆదర్శనగర్‌కు చెందిన జయంతిని వాటర్ బాటిళ్ల యూనిట్‌ను భాగస్వామ్యంతో నిర్వహిద్దామని నమ్మబలికాడు. దీంతో పెట్టుబడుల కోసమని పలు దఫాలుగా రూ.50 లక్షలు జయంతి అందజేసింది. అనంతరం నాయుడు మొహం చాటేశాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన జయంతి.. గురువారం అనంతపురం నాల్గో పట్టణ ఎస్‌ఐ గంగాధర్‌కు ఫిర్యాదు చేసింది. నాయుడిపై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత మృతదేహం లభ్యం


జ్యోతి (ఫైల్)

ఉరవకొండ: హంద్రీనీవా కాలువలో గల్లంతైన వివాహిత జ్యోతి (45) గురువారం మృతదేహమై తేలింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 10న ఉరవకొండ మండలం ఇంద్రావతి సమీపంలోని హంద్రీనీవా కాలువలో ఆమె దూకిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కాలువ వెంబండి కుటుంబసభ్యులు, పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం రాకెట్ల సమీపంలో కాలువ నీటిలో జ్యోతి మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు.

నగరానికి చేరువలో చిరుత!


నల్లగుట్టపై కూర్చొన్న చిరుత పులి

కూడేరు: అనంతపురం నగరానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఓ చిరుత గురువారం హల్‌చల్ చేసింది. కూడేరు మండలం గొటుకూరు నల్లగుట్ట సమీపంలోని పొలంలో పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు చంద్రారెడ్డి విద్యుత్ మోటార్ ఆన్ చేస్తుండగా గుట్టపై నుంచి చిరుత ఒక్కసారిగా కిందకు పరుగున వచ్చింది. ఈ విషయాన్ని గమనించిన రైతు కేకలు వేస్తూ చుట్టుపక్కల రైతులను అప్రమత్తం చేయడంతో అందరూ గ్రామంలోకి పరుగున చేరుకున్నారు. చిరుత సంచారంతో పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు వెనుకడుగు వేశారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని స్థానికులు కోరారు.

జిల్లా బాలుర హాకీ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 14 నుంచి 16 వరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే బాలుర జట్టును గురువారం ఆర్డీటీ క్రీడామైదానంలో ఎంపిక చేశారు. జట్టుకు కోచ్‌గా వెంకటేష్ నియమితులయ్యారు.

క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఎంపీ రంగయ్య



ఎంపీ తలారి రంగయ్యను సన్మానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలోని సదుం మండలంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి, ఎంపీ రెడ్డెప్పతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎంపీని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సన్మానించారు.

నేడు ప్రజా వేదిక

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి పనులపై ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2020 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన పనులపై ప్రజా వేదిక ఉంటుందన్నారు.

సేవారంగంలో మహిళల పాత్ర అభినందనీయం

అనంతపురం కల్చరల్: సేవారంగంలో మహిళల పాత్ర అభినందనీయమని డీఎస్పీ మల్లికార్జున వర్మ అన్నారు. గురువారం నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక పుట్టినిల్లు ఆశ్రమంలో నిత్యావసరాలు అందించారు. ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలామురళి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

పదోన్నతులు కల్పించాలి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో వివిధ కేడర్లలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కమిషనర్ కే భాగ్యలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. గురువారం నగరపాలక సంస్థలో కమిషనర్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. నగరపాలక సంస్థ ఉద్యోగులు శంకరయ్య, చిరంజీవి, కార్మిక నాయకుడు అజయ్‌బాబు, జేఏసీ నాయకులు రేకులకుంట రామాంజనేయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని అందిస్తున్న డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక రుద్రంపేట పంచాయతీ పరిధిలోని సచివాలయం-2లో క్షయ బాధితులకు అందించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రమోహన్, ఓబిరెడ్డిల ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించనున్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రమోహన్, ఓబిరెడ్డి, రుద్రంపేట గ్రామ సచివాలయ కార్యదర్శి నరసింహారెడ్డి, మహేష్‌రెడ్డి, శ్రావణి, శ్రీనివాసరెడ్డి, నిర్మల, ఏఎన్‌ఎం ఎర్రమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మట్కాపై ఉక్కుపాదం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వన్‌టౌన్ పోలీసులు మట్కా బీటర్లపై ఉక్కుపాదం మోపుతున్నారు. సీఐ రవిశంకరరెడ్డి ఆధ్వర్యంలో వారం రోజులుగా పోలీసులు మట్కా బీటర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. ఇప్పటికే రూ.లక్షలు నగదు సీజ్ చేశారు. గురువారం స్థానిక వేణుగోపాల్ నగర్‌కు చెందిన గురుప్రసాద్ అనే బీటరును అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.70 వేలు స్వాధీనం చేసుకున్నారు. గురుప్రసాద్ మట్కా బీటరుగా పని చేస్తూ వచ్చిన కలెక్షన్‌ను ఉదయ్‌కుమార్‌కు ఇచ్చేవాడని సీఐ తెలిపారు. గురుప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారని తెలియడంతో ఉదయ్‌కుమార్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

షాపింగ్ కాంప్లెక్స్ తనిఖీ

అనంతపురం క్రైం: కొత్తూరు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. కేటాయించిన గదుల్లోనే వ్యాపారాలు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వ్యాపారులు కాంప్లెక్స్‌లో వర్షపు నీరు వచ్చినప్పుడు ఇబ్బందిగా ఉంటుందని, టాయిలెట్స్ లేవని, తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా...అందుకు చర్యలు తీసుకోవాలని ఈఈ రామమోహన్ రెడ్డిని ఆదేశించారు. ఆర్‌ఓ సతీష్, డీఈ చంద్రశేఖర్, ఏఈ బాబావలి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి పాల్గొన్నారు.

జీఓ-1 రద్దు చేయాలి

అనంతపురం అర్బన్: సభలు, సమావేశాల నిర్వహణపై ఆంక్షలు విధిస్తూ జారీ చేసిన జీవో-1ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలంటూ ఏఐటీయూసీ నాయకులు గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ జీవో-1 ద్వారా ప్రజాఉద్యమాలు చేసే వారి స్వేచ్ఛను హరించడమే అన్నారు. జీవోని రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు ఈశ్వరయ్య, రమేశ్, కృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి జీవితం యువతకు స్ఫూర్తి

అనంతపురం: అంతర్జాతీయ దార్శనికుడు స్వామి వివేకానంద అని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. గురువారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువదినోత్సవాన్ని నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ దేశంలో ఉన్న యువకులందరూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఏమల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య , ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సదాశివా రెడ్డి, డాక్టర్ చాగంటి రామి రెడ్డి డాక్టర్ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. జేఎన్‌టీయూఏలో ఎంబీఏ విభాగంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ టి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అడహక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జయరామి రెడ్డి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతపురం సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపగ్రంథాలయ అధికారి వి. సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్, రామాంజనమ్మ, కావేరి, బాషా తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: యువత స్వామి వివేకనందను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ నుంచి యువతతో కలిసి టూకే రన్ నిర్వహించారు.

యోగాతోనే మానసిక ఆనందం

అనంతపురం కల్చరల్: యోగా, ధ్యానంతో మానసిక ఆనందం కలుగుతుందని వక్తలు పేర్కొన్నారు. గురువారం స్థానిక అశోక్‌నగర్‌లోని వివేకానంద పార్కులో వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం వివేకానంద యోగాకేంద్ర జిల్లా అధ్యక్షుడు



అశోక్‌నగర్‌లోని వివేకానంద పార్కులో వివేకానందుడిచిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి తదితరులు



ఎస్కేయూలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

మెళవాయి రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నాగత్రిశూలపాణి తదితరులు మాట్లాడారు. అనంతరం అశోక్‌నగర్‌లోని సరస్వతీ విద్యామందిరంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం యోగాసనాల పోటీల్లో దాదాపు 100 మంది పాల్గొన్నారు. సాయంత్రం బహుమతులు అందించారు. కార్యక్రమంలో యోగా గురువులు హనుమంతరెడ్డి, పుల్లయ్య, దివాకర్, మారుతీప్రసాద్, సుధాకరమూర్తి, పాల్గొన్నారు. ఆవోపా (ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో వైశ్యాహాస్టల్లో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు వివేకానందుని వేషధారణల్లో ఆకట్టుకున్నారు. రామకృష్ణసేవా సమితి వారు స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆలిండియా పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక స్టార్ కిడ్స్ చిన్నపిల్లల ఆస్పత్రి, ఫోకస్ ఐ హాస్పిటల్ వద్ద వైద్యులు డాక్టర్ సింధూర రెడ్డి, డాక్టర్ రామ్ ప్రియాంక, డాక్టర్ రఘువంశీ చైత్ర రెడ్డి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు సిబ్బంది జయచంద్రారెడ్డి, రవికృష్ణ, సంపత్‌కుమార్, రాజరాజేశ్వరి, కిరణ్‌కుమార్, రాజశేఖరరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: యువతకు వివేకానందుడు స్ఫూర్తి అని ఎస్‌వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ పేర్కొన్నారు. గురువారం హంపాపురం సమీపంలోని శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు జరిపారు. కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ సూర్యశేఖరరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాయి ట్రస్ట్ అధ్యక్షుడికి స్వామి వివేకానంద అవార్డు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్వామి వివేకానంద సేవా పురస్కార్‌కు అనంతకు చెందిన సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయి కుమార్‌కు దక్కింది. స్వామి వివేకానంద 160వ జయంతిని పురస్కరించుకొని గ్రీన్ ఇండియన్ పరివార్ ఫౌండేషన్, న్యూఢిల్లీ ప్రతి ఏడాది అందించే అవార్డు ఈ ఏడాది అనంతకు చెందిన సాయి ట్రస్ట్ వ్యవస్థాపకుడు విజయసాయికుమార్‌కు దక్కింది. వర్చువల్ విధానంతో ఆయనకు అవార్డును అందజేశారు.

అనంతపురం క్రైం: ఆదర్శప్రాయులు స్వామి వివేకానంద అని మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ వివేకానంద చిత్రపటానికి మేయర్, డిప్యూటీ మేయర్లు, పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు, చంద్రమోహన్ రెడ్డి, బాలాంజనేయులు, సైపుల్లాబేగ్, దుర్గాదేవి, డీఈ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అగ్రికల్చర్: వివేకానంద యువతకు స్ఫూర్తినిచ్చిన గొప్ప ప్రజ్ఞాశాలి అని టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళి అన్నారు. గురువారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డైరెక్టర్లు రమణయ్య, వెంకటాద్రి, గోల్డ్‌బాషా, చంద్రశేఖర్, భాస్కర్, సీఈవో విజయభాస్కర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ ఎం.వెంకట కృష్ణా రెడ్డి

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త క్యాలెండర్, డైరీని కలెక్టర్ నాగలక్ష్మి గురువారం ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) యమ్మాని భాగ్యరాజ్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డీఎల్ మురళీ, ఉపాధ్యక్షురాలు జింకా కృష్ణజ్యోతి, జోనల్ సెక్రటరీ ప్రసాద్, శ్రీసత్యసాయి జిల్లా సెక్రటరీ లక్ష్మీనారాయణ, ట్రెజరర్ పాండురంగారెడ్డి, జాయింట్ సెక్రటరీ నారాయణస్వామి, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర జోనల్ సెక్రటరీ మద్దిలేటి, ఇంజినీర్లు సంగీత, గోపాల్‌నాయక్, నాగేంద్రకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) రవి పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం: వైఎస్సార్‌టీఎఫ్ -2023 క్యాలెండర్‌ను అనంతపురం ఇన్‌చార్జి డీఈఓ ఎం.వెంకట కృష్ణా రెడ్డి గురువారం ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, విద్యా రంగ అభివృద్ధికి వైఎస్సార్‌టీఎఫ్ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. అశోక్‌కుమార్ రెడ్డి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, కే గోవింద రెడ్డి, రాష్ట్ర నాయకులు ఏ రాధాకృష్ణా రెడ్డి, నాగిరెడ్డి, వెంకట రమణ, ఓబిరెడ్డి, గోపాల్, వెంకట రెడ్డి, శివ ప్రసాద్, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోబీ ఘాట్ స్థలం కబ్జా చేశారని నిరసన



నిరసన తెలుపుతున్న రజకులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో ఇటుకలపల్లి పొలం 109 సర్వే నంబరులో దోబీ ఘాట్ స్థలాన్ని కబ్జా చేశారని రజకులు అన్నారు. గురువారం దోబీఘాటు వద్ద ఆందోళన చేశారు. రజక సంఘం అనంతపురం మండలం కన్వీనర్ ఈశ్వరయ్య, కో కన్వీనర్ ప్రసాద్ మాట్లాడారు. ఆకుతోటపల్లి గ్రామంలో 42 రజక కుటుంబాలు కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. 40 ఏళ్లుగా 109 సర్వే నంబర్‌లో 5 ఎకరాల భూమిలో ప్రభుత్వం నిర్మించిన దోబీఘాట్‌లో దుస్తులు ఉతుకుతున్నారన్నారు. కొందరు కబ్జాదారుల కన్ను ఈ భూమిపై పడిందన్నారు. కార్యక్రమంలో రజకులు ఆంజనేయులు, నారాయణస్వామి, ఆదెమ్మ, ఆదినారాయణమ్మ, గంగమ్మ, ఓబులేసు, మల్లన్న , ఆదినారాయణ, నాగరాజు, జయప్ప, హరీష్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల అభ్యున్నతే లక్ష్యం

- ఏపీ ఎండోమెంట్ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్



జ్వాలాపురం శ్రీకాంత్‌ను అభినందిస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్: అర్చకుల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఏపీ ఎండోమెంట్ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ పేర్కొన్నారు. ఎండోమెంట్ సలహాదారుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి అనంతకొచ్చిన ఆయనకు బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు స్వాగతం పలికారు. రామ్‌నగర్‌లోని బ్రాహ్మణసేవా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో అర్చకులకు మెడికల్ రీఎంబర్స్‌మెంట్ కింద 50 శాతం మాత్రమే ఇచ్చేవారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 100 శాతం రీఎంబర్స్‌మెంట్ ఇచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. అంతకు ముందు ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనిధి రఘు, ఉప్పల ఆనంద్, కౌసల్య, వంశీ, రాధ, శివ తదితరులు పాల్గొన్నారు.

క్యాలండర్ ఆవిష్కరణ : సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 14న జరుగనున్న గోదాదేవి వేషధారణ పోస్టర్లను ఆవిష్కరించారు. గురువారం రామనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఎఫ్‌రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదాదేవి కల్యాణంతో పాటు చిన్నారులకు శ్రీకృష్ణ, గోదాదేవి వేషధారణల పోటీలుంటాయని, ఆసక్తి ఉన్న వారు సెల్: 9849540680లో పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకుడు విజయసాయి అన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



బహుమతి అందిస్తున్న అనంత చంద్రారెడ్డి, వాసంతి సాహిత్య

అనంతపురం కల్చరల్: అమ్మ సిల్వర్ పాలెస్ నిర్వాహకులు హరి, అనిల్ గౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు గురువారం సాయంత్రం బహుమతులు అందించారు. స్థానిక రెండో రోడ్డు వద్ద జరిగిన కార్యక్రమానికి రిలాక్స్ నాగరాజు అధ్యక్షత వహించారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడారామలక్ష్మి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామల అనిల్‌గౌడ్, సుజాతరెడ్డి, లలిత, కార్పొరేటర్ చంద్రమోహనరెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి తదితరుల చేతుల మీదుగా స్వాతి, రమ్యకృష్ణ, దీప మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతి అందుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కనగానపల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎక్కడైనా కోడి పందేలు, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ హనుమంతరెడ్డి హెచ్చరించారు. గురువారం మద్దెలచెరువు, శివపురం, వేపకుంట గ్రామాల్లో ఆయన పర్యటించారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

బుక్కరాయసముద్రం: రైతులు మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం రేగడి కొత్తూరు గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య మాట్లాడుతూ మొక్కజొన్న పంట లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ పంటలకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

= జగనన్న మేలు మరువలేం బంగారమ్మ ఆదెమ్మ కుటుంబానికి గత మూడేళ్లలో రూ.8,28,538 దాకా లబ్ధి చేకూరింది. ఈ కుటుంబంలో ఐదుగురు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.2 లక్షలు, వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) రూ.3,764, వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.1,00,750, వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.18,750, ఇంటి స్థలం రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్ష లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చదివి వినిపించారు.



రాప్తాడులో లబ్ధిదారులకు పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు.గత ప్రభుత్వాలు నియోజకవర్గ అభివృద్ధిని చిన్నచూపు చూడడంతో ఆశించిన మేర అభివృద్ధి జరగలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం జగన్‌మోహన్ రెడ్డి చొరవతో రాప్తాడును మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపలోనూ గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను అప్యాయంగా పలకరించారు.

పార్టీలకతీతంగా పథకాలు మంజూరు :

గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ సానుభూతి పరులకే పథకాలు అందేవని, ప్రస్తుతం తాము పార్టీలు,కులమతాలకతీతంగా అర్హులందరికీ వలంటీర్ల ద్వారా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తున్నారన్నారు. రైతు ప్రభుత్వమంటే మాదే అని గర్వంగా చెప్పుకునేలా జగనన్న రైతులకు అండగా ఉంటున్నారన్నారు. మూడేళ్లలో జగనన్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. గత మూడేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. దీంతో ఒక్కసారిగా ప్రజల నుంచి భారీ స్పందన లభించింది.

పౌష్టికాహారం పంపిణీ :

స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులు, తల్లులకు ప్రభుత్వం మంజూరు చేసిన పౌష్టికాహారాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారం తీసుకునేలా చూడాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించొచ్చన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో పలువురికి ఆర్థిక సాయం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ యర్రగుంట జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనరసింహులు, ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, ట్రాన్స్‌కో ఏఈ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీ రాణీ, నాగరత్నమ్మ, అగ్రిబోర్డ్ చైర్మన్ కేశవ రెడ్డి, మరూరు సొసైటీ అధ్యక్షుడు కొండారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధామ, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నాయకులు నారాయణ స్వామి, చిట్రా వెంకటరాముడు, ఎల్‌ఐసీ వెంకటరాముడు, పూజారి ఓబులయ్య, సాకే చంద్ర, మన్నల రవి, చిరుతల నాగేంద్ర, నారాయణ, బోయ రాము, జయన్న, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో పి.యాలేరు వ్యవసాయ పరపతి సహకార సంఘం బ్యాంకు క్యాలెండర్‌లను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సహకార సంఘ డైరెక్టర్లు డాబా మల్లన్న, మల్లెల నారపరెడ్డి , రైతులు తదితరులు పాల్గొన్నారు.

తోపుదుర్తిలో భారీ ఎత్తున గ్రామోత్సవ ఏర్పాట్లు



గ్రామోత్సవానికి ఆహ్వానిస్తున్న తోపుదుర్తి చందు

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి గ్రామంలో ఈ నెల 17,18న జరగబోవు పెద్దమ్మ తల్లి ఊరు దేవరకు భారీ ఏర్పాట్లు చేశారు. 140 ఏళ్ల తర్వాత తోపుదుర్తి కుటుంబం, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఊరుదేవర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు. 17న ఉదయం 7 గంటలకు వీరాంజనేయ స్వామికి జ్యోతులు, మధ్యాహ్నం 2 గంటలకు పోతురాజు ఊరేగింపు, గ్రామార్పణ కార్యక్రమం ఉంటుంది. రాత్రి 11:30 గంటలకు బలిహారణం, జలి గంప ప్రదక్షిణం ఉంటుంది. 18న మధ్యాహ్నం 12 గంటలకు మంగళహారతి అనంతరం అమ్మవారిని పొలిమేరకు చేర్చే కార్యక్రమాలు ఉంటాయి. గ్రామోత్సవానికి నియోజకవర్గంలోని ఆరు మండలా ప్రజలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, సోదరులు తోపుదుర్తి చందు, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కులమత పార్టీలకతీతంగా ఆహ్వానిస్తున్నారు. తోపుదుర్తి చందు గురువారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి, ప్రజలను ఆహ్వానించారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లో మాతా శిశు మరణాలను తగ్గించేందుకు తగ్గించాలని ఏఎస్‌ఎం చంద్రకళ పేర్కొన్నారు. గురువారం చిన్మయనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-1లో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు శివలక్ష్మి, వీరమ్మ, నాగేంద్రమ్మ, లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు యల్లమ్మ, మాధవి, అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి, సులోచన పాల్గొన్నారు.

న్యాయం చేయండి



కలెక్టరేట్ ఆవరణలో సమస్య చెబుతున్న అంబులెన్స్ డ్రైవర్లు

అనంతపురం అర్బన్: సీఎం సార్.. న్యాయం చేయాలని అంబులెన్స్ డ్రైవర్లు విన్నవించారు. తమను నియమించుకున్న జీవీకే సంస్థ రెండు నెలలుగా వేతనంలో రూ.2 వేలు కోత విధిస్తోందని, ఈ విషయంలో ముఖ్యమంత్రి తమను ఆదుకోవాలని కోరారు. సమస్యను కలెక్టర్ నాగలక్ష్మికి విన్నవించుకునేందుకు డ్రైవర్లు శివప్రసాద్, పవన్ సాయి, ఆనంద్, నాగేష్‌నాయక్ గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. అనంతరం వారు మాట్లాడారు. రూ.10,800 వేతనంతో తమను జీవీకే సంస్థ నియమించుకుందని తమకు రూ.21 వేలు వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

చెత్తను వేరు చేసి ఇవ్వండి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ సరఫరా చేసిన మూడు రకాల గ్రీన్, బ్లూ, రెడ్ డబ్బాల్లోనే చెత్తను వేరు చేసిన పారిశుధ్య కార్మికులకు అందించాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి నగర ప్రజలకు సూచించారు. గురువారం నగరంలోని కోవూర్‌నగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో క్లాప్ ఆటోల ద్వారా సేకరిస్తున్న చెత్త నిర్వహణను అదనపు కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. కోవూర్‌నగర్ విద్యారణ్య పాఠశాల ముందు రోడ్డుపై చెత్త కుప్పలు కనిపించడంతో శానిటరీ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లపై అదనపు కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...
* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్ కింగ్


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటో గ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంత వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్‌క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

■ పెద్ద పండగ


పండగపూట పల్లెటూర్



- మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.
- పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!
- గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్ పవర్: డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ ధర: ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు బ్యాటరీ: 270 ఎంఏహెచ్ రిజల్యూషన్: 368×448 పిక్సెల్స్ బ్యాటరీ: 270 ఎంఏహెచ్ మోడ్స్: 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) కలర్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ బ్యాటరీ: 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
- ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి
- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

"'వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు
- దేవిశ్రీ ప్రసాద్



"'వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు" అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.


- చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.
- బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.
- ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడ దని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.
- ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి
- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్


● అభిరామ్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.

రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి
- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.